ప్రజాశక్తి
బుధవారం 3 ఏప్రిల్ 2024
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

ఉమ్మడి విశాఖ నుంచి ఆరు అసెంబ్లీ స్థానాలకు పేర్లు ప్రకటన

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

లోక్‌సభ, శాసనసభకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. మంగళవారం విడుదల చేసిన ఆ జాబితాలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఆరుగురికి చోటు దక్కింది. వీటిలో భాగంగా విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి జి.శ్రీనివాసరావు, మాడుగుల నుంచి బిబిఎస్.శ్రీనివాసరావు, అనకాపల్లి నుంచి ఐ.రామగంగాధరరావు, పెందుర్తి నుంచి పి.భగత్, పాయకరావు పేట నుంచి బోని తాతారావు, పాడేరు (ఎస్‌టి) నుంచి శతక బుల్లిబాబు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేయనున్నట్లు అధిష్టానం పేర్కొంది.

వీరిలో విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న గుత్తుల శ్రీనివాసరావు నగరంలోని సీతమ్మధార బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన బికాంతో పాటు ఎల్ఎల్‌బి పూర్తి చేశారు. 1997 నుంచి 2000 వరకు విశాఖపట్నం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గానూ, 2000-01లో స్టేట్ జనరల్ సెక్రటరీగానూ, 2006లో ప్రెసిడెంట్‌గానూ పనిచేశారు. 2009లో కాంగ్రెస్ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. 2011 నుంచి పిసిసి కార్యదర్శిగా

జి.శ్రీనివాసరావు (విశాఖ తూర్పు)

పి.భగత్ (పెందుర్తి)

ఎస్.బుల్లిబాబు (పాడేరు)

బి.తాతారావు (పాయకరావుపేట)

రామగంగాధర్ (అనకాపల్లి)

బి.శ్రీనివాసరావు (మాడుగుల)

పనిచేస్తున్నారు.

అనకాపల్లి స్థానానికి పోటీ చేస్తున్న ఇల్లా రామ గంగాధర్ పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందినవారు అంచెలంచెలుగా ఎదిగారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవలు అందించారు. అనంతరం రాజకీయాల్లో ప్రవేశించి 2009, 2014 ఎన్నికలలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ వెంట ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ నుంచి ఎంతో మంది వెళ్లిపోయినా పార్టీనే నమ్ముకుని పనిచేశారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆయన పోటీ చేశారు. ప్రస్తుతం పార్టీ అనకాపల్లి అసెంబ్లీ ఇన్‌ఛార్జిగానూ, పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధిగానూ పనిచేస్తున్నారు.

మాడుగుల నియోజకవర్గం నుంచి బొడ్డు శ్రీనివాసరావు బరిలో ఉన్నారు. కాలేజీ రోజుల్లో ఎన్‌ఎస్‌యుఐలో అధ్యక్షునిగా పనిచేశారు. ఆయన తండ్రి బొడ్డు మోదు నాయుడు కాంగ్రెస్‌లో సేవలు అందించారు. చీడికాడ పిఎసిఎస్ అధ్యక్షులుగా, అనంతరం మండల పార్టీ మిగతా 2లో..

దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్న బిజెపిని, దాని మిత్రపక్షాలను ఓడించండి

కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పిలుపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్న బిజెపికి, దానికి సహకరిస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి నాయకులు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన దీక్షలు మంగళవారానికి మూడేళ్లకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్ద భారీ నిరసన దీక్ష చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి, జెఎసి ఛైర్మన్ మంత్రి రాజశేఖర్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడారు. ఉధృత పోరాటాలతో ప్లాంట్‌ను రక్షించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, నాయకులు జి.అప్పలరాజు, ఎం.సుబ్బారావు, కెవిపి.చంద్రమౌళి, కె.శేఖర్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, నాయకులు పడాల రమణ, జి.వామనమూర్తి, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి శంకరరావు, సిఎఫ్‌టియుఐ జిల్లా నాయకులు కె.లక్ష్మి పాల్గొన్నారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

ఉత్పత్తిలో స్టీల్‌ప్లాంట్ ప్రగతి

▶ వార్త మెయిన్‌లో..

తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్

▶ వార్త 2లో..

పలువురు వాలంటీర్లు రాజీనామా

▶ వార్త 6లో..

కేసు వివరాలు వెల్లడిస్తున్న డిసిపి మణికంఠ

విద్యార్థిని ఆత్మహత్య కేసులో

నిందితులు అరెస్టు

ర్యాగింగ్ సహా పలు విషయాలు వెలుగులోకి..

వార్త మెయిన్‌లో..

క్రికెటర్ల పౌష్టికాహారం కోసం రూ.1.50 కోట్లు

◆ దేశంలోనే మొట్టమొదటి సారిగా అమలు

◆ చెక్కును అందజేసిన సౌరభ్ గంగూలీ, రికీ పాంటింగ్, గోపీనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - పిఎం.పాలెం : పౌష్టికాహార లేమితో ఉన్న జోనల్ స్థాయి 400 మంది క్రికెటర్లకు పౌష్టికాహార నిమిత్తం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రూ. 1.50 కోట్ల సాయం అందజేసింది. ఈ మేరకు నగరంలోని పిఎం.పాలెంలో ఉన్న స్టేడియంలో మంగళవారం ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి, బిసిసిఐ మాజీ ప్రెసిడెంట్, భారత మాజీ కెప్టెన్, ఢిల్లీ క్యాపిటల్స్ డైరెక్టర్ సౌరభ్ గంగూలీ, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్, ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ చేతుల మీదుగా రూ.1.50 కోట్ల విలువ చేసే చెక్కును క్రికెటర్లకు అందజేశారు. అనంతరం గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ యువ క్రికెటర్లు పౌష్టికాహార లేమితో బాధ పడకూడదనే ఉద్దేశంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి నాయకత్వంలో ప్రణాళికను అమలు చేసినట్లు



క్రీడాకారులకు చెక్కు అందజేస్తున్న గంగూలీ, రికీపాంటింగ్, గోపీనాథ్‌రెడ్డి

తెలిపారు. అకాడమీలు, కోచింగ్ క్యాంప్‌లలో శిక్షణ తీసుకున్న వారి పౌష్టికాహారం కోసం నెలకు రూ.3 వేల చొప్పున 400 మంది క్రికెటర్లకు ఏటా రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎసిఎ పరిధిలో ఉన్న అకాడమీలు, సబ్ సెంటర్లలో కల్పించిన మౌలిక సదుపాయాల వల్ల మంచి ఫలితాలు వచ్చాయన్నారు. సౌరభ్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

అధ్యక్షులుగా పనిచేసి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేశారు. తండ్రి బాటలోనే శ్రీనివాసరావు నడుస్తున్నారు. 2018లో మాడుగుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లా పార్టీ ఇన్‌ఛార్జిగానూ పనిచేశారు. పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పార్టీ బలోపేతానికి కృషి చేశారు.

పెందుర్తి అభ్యర్థిగా పిరిడి భగత్ పోటీ చేస్తున్నారు. ఆయన 93వ వార్డు పరిధి బాలాజీ గార్డెన్‌లో నివాసం ఉంటున్నారు. ఎల్‌ఎల్‌బి విద్య అభ్యసించారు. జెఎన్‌టియులో ఎంబిఎ చేశారు. 2007 నుంచి ఎన్‌ఎస్‌యుఐలో పలు హోదాల్లో పనిచేశారు. 2017-19 మధ్య రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున పోటీ చేశారు.

పాయకరావు పేట నుంచి పోటీ చేస్తున్న డాక్టర్ బోని తాతారావు వైద్య విద్య అభ్యసించారు. ప్రొఫెసర్‌గా సేవలందించారు. విశాఖ జిల్లా భీమునిపట్నం మండలానికి చెందిన ఆయన విశాఖ నగరంలోని పెదవాల్తేరులో నివాసం ఉంటున్నారు.

పాడేరు అసెంబ్లీ అభ్యర్థిగా బుల్లిబాబు

ట్రైకార్ మాజీ చైర్మన్ సతక బుల్లిబాబును కాంగ్రెస్ పార్టీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థిగా అధిష్టానం ఖరారు చేసింది. ఆయన ప్రత్యర్థ వైసిపి, టిడిపి అభ్యర్థులకు ధీటుగా నిలవనున్నారని పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. తొలుత కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన బుల్లిబాబు తర్వాత వైసిపి ఆవిర్భావం నుంచి సేవలు అందిస్తూ వచ్చారు. పార్టీ పాడేరు మండల అధ్యక్షులుగానూ, అరకు పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీగానూ పార్టీ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ శ్రేణులను నడిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఏపి ట్రైకార్ చైర్మన్‌గా వైసిపి ప్రభుత్వం నియమించింది. తరువాత కాలంలో రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల చైర్మన్ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా ట్రైకార్ చైర్మన్ పదవిని పొడిగించలేదు. ఈ విషయంలో బుల్లిబాబు అసంతృప్తికి గురయ్యారు. ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన ఇవ్వకపోయినా పార్టీకి సేవలందించిన వ్యక్తిగా కనీస గౌరవం ఇవ్వలేదన్న బాధ ఆయనను కలిచి వేసింది. ఆ తరువాత పార్టీకి దూరం జరిగారు. ఇటీవల చింతపల్లిలో షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ క్రమంలోనే ఆయనకు టికెట్ దక్కింది.

క్రికెటర్ల పౌష్టికాహారం కోసం రూ.1.50 కోట్లు

గంగూలీ, రికీ పాంటింగ్ మాట్లాడుతూ యువ క్రికెటర్ల పౌష్టికాహారం కోసం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఈ పథకాన్ని అమలు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎసిఎ జాయింట్ సెక్రెటరీ రాకేష్, సిఇఒ డాక్టర్ ఎంవి.శివారెడ్డి, జనరల్ మేనేజర్లు ఎంఎస్.కుమార్, ఎస్ఎంఎన్.రోహిత్ పాల్గొన్నారు.

ఓటు అభ్యర్థిస్తున్న ఎంవివి.సత్యనారాయణ

17వ వార్డులో కొనసాగిన ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి పాలనలో ప్రజా సంక్షేమాన్ని అమలు జరిపామని విశాఖ ఎంపీ, ప్రస్తుత తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం జివిఎంసి 17వ వార్డు ఎంవిపి.కాలనీ సెక్టార్-4, వెంకోజీపాలెంలో ఆయన పాదయాత్ర కొనసాగించారు. వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, నాగరాజు, పార్టీ నాయకులు ఆయన వెంట నడిచారు. వైసిపి హయాంలో అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తునకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల సమస్యలను మ్యానిఫెస్టోలో చేర్చండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చి భరోసా కల్పించాలని జర్నలిస్టు సంఘాల నేతలు కోరారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం విశాఖ లోక్‌సభ టిడిపి అభ్యర్థి ఎం.శ్రీ భరత్, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీలకు ఈ మేరకు వినతి పత్రాలు అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను వారితో చర్చించారు. కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎంఎ) అధ్యక్షులు పి.సత్యనారాయణ, ఎపియూడబ్ల్యుజే జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్, అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి కమల్ కుమార్, ఎల్ఎన్ఎ ప్రతినిధులు ఆర్.అబ్బాస్, ఎం.శ్రీహరి, నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

శ్రీభరత్‌కు సమస్యలను తెలియజేస్తున్న నాయకులు

39వ వార్డులో వాసుపల్లి ప్రచారం

ప్రచారం నిర్వహిస్తున్న వాసుపల్లి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 39వ వార్డులో వైసిపి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మంగళవారం ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ఓటర్లను పలకరించారు. స్టెప్పులు వేసి వారిని ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 39వ వార్డు పార్టీ అధ్యక్షురాలు, శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం, మైనార్టీ సెల్ అధ్యక్షులు ముజీబ్ ఖాన్, సబీరా బేగం, సనపల రవీంద్ర, సలీం పాల్గొన్నారు.

అలాగే ఆశీలు మెట్టలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబుకు అవ్వాతాతల ఉసురు తగలక తప్పదని అన్నారు. ఆయన తీరు వల్లే పెన్షన్లు సకాలంలో అందలేదన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, కార్పొరేటర్లు కోడూరు అప్పల రత్నం, మేరీ జోన్స్, చెన్నా జానకిరామ్, జెసిఎస్ మండల అధ్యక్షుడు దొడ్డి రామానంద్, సత్యనారాయణ ఆయన వెంట ఉన్నారు.

త్వరలో టిడిపిలో చేరుతా : సీతంరాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమి అభ్యర్థి గెలుపునకు గట్టిగా కృషి చేస్తానని, తెలుగుదేశం పార్టీ నుండి ఆహ్వానం ఉందని, త్వరలోనే ఆ పార్టీలో చేరుతానని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ తెలిపారు. తనకు వైసిపిలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతు ఇస్తూ ఆయన గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవికాలం దృష్ట్యా మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో తలెత్తే తాగునీటి సమస్యల పరిష్కారం కోసం టిఎస్ఆర్ కాంప్లెక్స్ నీటి సరఫరా విభాగంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. నగరంలో తాగునీటి సరఫరాలో కలిగే పలు అంతరాయాలు/ ఇబ్బందులు, పైప్ లైన్ లీకులు, బోర్‌వెల్స్ మరమ్మతులు మొదలైన తాగునీటికి సంబంధించిన సమస్యలను పరిష్కరించుకునేందుకు 9154109160 నెంబరును సంప్రదించాలని ప్రజలను కోరారు.

స్పోర్ట్స్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుండి మే 9 వరకూ జరిగే మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. డిఆర్ఎం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు డివిజన్ ప్రెసిడెంట్ సౌరభ్ ప్రసాద్, ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - వి.ఆర్.పురం : వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని వరరామచంద్రాపురం ఎస్సై కె. నాగరాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని రాజపేట మూడురోడ్ల సర్కిల్లో మంగళవారం పోలీసులు వాహన తాఖీలు నిర్వహించారు. వాహన కాగితాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, బండి ఇన్సూరెన్స్, బండి వివరాలు కలిగి ఉండాలని సూచించారు. టూ వీలర్‌పై ముగ్గురు వ్యక్తులు కలిగి ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నగదు రూపేణా వాహనాల్లో డబ్బు కలిగిఉన్నా వాటికి సంబంధించి వివరాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై రాధాకృష్ణ, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE VII ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.No. 447 / 2017

Between :
Cherakapu Rama Rao ...Plaintiff
And :
Thonda Kondala Rao & 4 others ...Defendants

NOTICE

1st Defendant :- Thonda Kondala Rao S/o Anjaneyulu, resident of D.No.65-1-45/2, Balaji Nagar, Kodipandaludibba, Sriharipuram, Malkapuram Post, Visakhapatnam-II

2nd Defendant :- Thonda Vamakshi W/o. Thonda Kondala Rao, resident of D.No. 65-1-45/2, Balaji Nagar, Kodipandaludibba, Sriharipuram, Malkapuram Post, Visakhapatnam-II

Please take notice that the above matter is posted to 01.05.2024 at 10.30 a.m. for appearance of the defendants 1 and 2, hence you please attend the Honourable Court on 01.05.2024 at 10.30 a.m. either by you or through your advocate, failing which the above matter will be decided in your absence.

Visakhapatnam
Date:02-04-2024

N.NAGESWARA RAO
K.V.NARAYANA MURTY
ADVOCATE
D.No.27-32-100, 75 Feet Road, Near Dolphin Hotel
VISAKHAPATNAM-53001
Cell No.9948843507

నోటీసు
మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S. No. 59/2021

Between:
లోకా దేవుడు బాబు @ దేవుడు అండ్ అదర్స్ ...వాదులు
మరియు
లోకా దుర్గాప్రసాద్ అండ్ అదర్స్...ప్రతివాదులు

టు : 11వ డిఫెండెంట్ / 11వ ప్రతివాది :
కోనా సుభద్ర, W/o. నాగేశ్వరరావు
వయస్సు 37 సం॥లు, డో.నెం. 4-1,
పాయకరావుపేట, అనకాపల్లి, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు గల దావాలో మీరు 11వ ప్రతివాది అయి ఉన్నారు. మీకు శ్రీ కోర్టువారు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా సదరు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయునందున పై నెంబరు గల దావా **ది. 16-04-2024న** వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు అయి పై దావాలో మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల పై దావా మీకు పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

|| ఇది శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం జారీ చేయబడిన నోటీసు ||

పి.వి.ఎస్.ఆర్. మూర్తి, అడ్వకేట్
డో.నెం. 4-2-133, కుచివారి వీధి, పిఠాపురం. సెల్: 9848006149
పిఠాపురం.
ది.01-4-2024

IN THE HONOURABLE COURT OF THE 4th ADDL DISTRICT CUM MACT (SC&ST) COURT AT SRIKAKULAM.
M.V.O.P. 211/2023

Between:-**Neelamsetti Krishna.** ...Petitioner
And:- **Piriya Madhu Sudhana Rao @ Madhu.& Others** ...Respondents

To
R-2: Sri Sri Sai Ganesh Constructions, represented by Koti Raghavendra Rao, Owner of Crime vehicle i.e., Road Roller No. AP-31ET-4598, Dr.No:58-16-32, 2nd Floor, Gurajada Nagar, NAD, Kotha Road, Visakhapatnam.

పైన సుదహరించిన MVOP. No. 211/2023 పై కోర్టులో మీ హాజరు నిమిత్తం తేది. 25-04-2024న ఉన్నది. మీరు వ్యక్తిగతముగా కాని మీ తరుపున వకీలు ద్వారా కాని పై కోర్టులో **తేది 25-04-2024 ఉ॥ గం॥ 10.30 ని॥లకు** హాజరై మీయొక్క వాదనను స్టేట్మెంట్‌తో సహా పై కోర్టు వారికి తెలుపుకోవలెను. పైన చెప్పబడిన తేదీన మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్ష మందు పైవాజ్యమును కోర్టు వారు విచారణ చేసి తీర్మానించడమగునని మీరు తెలుసుకోవలసినది.

B. SYAMA SUNDARA RAO
ADVOCATE
SRIKAKULAM, CELL: 9704554004

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A. 127/2023 in O.S.77/2023

Between:
Garikina Satya Rao ...Petitioner/Plaintiff
And:
Badidhaboyina Appa Rao ...Respondent/Defendant

NOTICE

To,**The Respondent:**
Badidhaboyina Appa Rao,
S/o. Late Chinna Rao,
R/at D.No.58-9-68,
Adilakshmi Nilayam,
Sai Baba Temple Down,
4th Lane, New Karsha,
NAD X Road, Visakhapatnam-09.

Please take notice that the above named petitioner/plaintiff has instituted the above case against you and the matter stands posted to **18-04-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **18-04-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte asper law.

D. UMA RANI &
D. SHOBA RANI,
Advocates,
Visakhapatnam,
Cell: 9440195629.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE CUM M.A.C.T. AT: VISAKHAPATNAM
M.O.P.1030/2022

Between:
Smt. Boddeti Maha Lakshmi & another ... Petitioners
And:
K.Bangaru Raju & 2 others ...Respondents

NOTICE

To,
R-2:**Surappadu Yayyipurapu,**
S/o.Lakshmu Naidu,
Owner of the Lorry AP 31 TT 5468,
R/at: D.No.58-1-333,
Butchirajupalem,
Visakhapatnam-530027.

Please take notice that the above named petitioners has instituted the above case against you and the same stands posted to **29-04-2024** for your appearance on that day you are personally or through Advocate attend before the Hon'ble Court at **10:30 A.M.**, failing which the matter will be heard and determined in your absence exparte, asper law.

DAMODARA APPALANAIDU,
Advocate,
Visakhapatnam.
Cell: 9885325688.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్థానిక ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డి రాజకీయ పార్టీల నాయకులకు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళ వారం సాయంత్రం పలు అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఇప్పటికే గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఎన్నికల నియమావళి అమలుపై పలువురి సందేహాలను ఆర్‌డిఒ నివృత్తి చేశారు. సువిధ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో టిడిపి నుంచి గంటా నూకరాజు, డిఎఎన్.రాజు, కాంగ్రెస్ నుంచి పల్లా వెంకటరావు, కె జగన్నాధం, బిఎస్‌పి నుంచి భాగం గోపాలరావు, జనసేన నుంచి అనిల్, ఆమ్ ఆద్మీ నుంచి ఎన్ భాస్కర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భాస్కరరెడ్డి

బోని - ఆనందపురం రోడ్డులో దొంగల బెడద

ప్రజాశక్తి -పద్మనాభం : ఆనందపురం మండలం బోని గ్రామం నుంచి ఆనందపురం రోడ్డులో రాత్రివేళ దొంగల బెడదతో ప్రయాణికులు ఆందోళనచెందుతున్నారు. రాత్రి 8 నుంచి వేకువజాము 4 గంటల వరకు రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు వ్యక్తులు దారిలో కాపుకాసి ప్రయాణికులపై దాడుచేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. వాచీలు, నగదు, సెల్ ఫోన్లు తీసుకుంటున్నారని, వాహనాలను కూడా తీసుకొనే ప్రయత్నాలు చేస్తున్నారని పాండు గ్రామానికి చెందిన నరసయ్య, కొలగాని గౌరి, కె.అప్పలరాజు తెలిపారు. తమపై దాడి జరిగిందని వారు ప్రత్యక్షంగా తెలిపారు. పద్మనాభం, ఆనందపురం పోలీసులు ఈ రోడ్డుపై గస్తీకాయాలని ప్రయాణికులు కోరుతున్నారు. డ్యూటీ నుంచి వచ్చే ప్రైవేటు ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు.

సైనికుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -మధురవాడ : భారత సైనిక దళంలో పనిచేస్తూ ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన పి.శ్రీనివాస్ కుటుంబానికి విశాఖలోని ఓ విద్యావేత్త కుటుంబం ఆర్థిక సహాయం అందించింది. తూర్పుగోదావరి జిల్లా కె.గంగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన పి.శ్రీనివాస్ మద్రాస్ రెజిమెంట్-16 ట్రావెన్ కోర్ విభాగంలో సేవలందించారు. గౌహతి సరిహద్దులో విధులు నిర్వహిస్తూ గత ఏడాది జులై 29న ఉగ్రవాదులతో పోరాడి వీరమరణం పొందారు. పి.శ్రీనివాస్ భార్య పి.శ్రీలక్ష్మి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడిని చదివిస్తూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకుని విశాఖకు చెంది గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మాజీ ప్రొఫెసర్ డి.ప్రసాదరావు ఆ కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. నగదు మొత్తాన్ని చెక్కు రూపంలో ప్రొఫెసర్ ప్రసాదరావు సతీమణి డి.లక్ష్మీకాంతమ్మ సైనికుని కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

సైనికుని కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న లక్ష్మీకాంతమ్మ

'అల్లూరిది మా ఊరే'కు అభినందనలు

ప్రజాశక్తి -పద్మనాభం : ప్రజాశక్తి దినపత్రిక ఆదివారం సంచిక స్నేహలో ప్రచురించిన 'అల్లూరిది మా ఊరే' కథనంపై మాజీమంత్రి ఆర్‌ఎస్‌డిపి.అప్పలనరసింహరాజు స్పందించారు. ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు. పద్మనాభం మండలంలోని పాండ్రంగి గ్రామంలోని తన నివాసంలో మంగళవారం ఆ కథనాన్ని చదివి అందరికీ చూపించారు. ఈ సందర్భంగా అప్పలనరసింహరాజు మాట్లాడుతూ, 'ఒక్కడే వీరుడు' పేరుతో అల్లూరిపై సినిమాను తమ గ్రామానికి చెందిన సత్యనారాయణరాజు చిత్రీకరించారని, అల్లూరి జీవిత చరిత్ర అంశాలతో వాస్తవంగా తీశారని తెలిపారు. అనంతరం అప్పలనరసింహరాజును అల్లూరి ఒక్కడే వీరుడు నిర్మాత సత్యనారాయణరాజు సన్మానించారు.

ప్రజాశక్తి స్నేహలో వచ్చిన కథనాన్ని చూపిస్తున్న ఆర్‌ఎస్‌డిపి అప్పలనరసింహరాజు, నిర్మాత సత్యనారాయణరాజు తదితరులు

వైసిపిలో జనసేన కార్యకర్తలు చేరిక

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పంచాయతీ నుంచి జనసేన ఎంపిటిసి అభ్యర్థిగా పోటీ చేసిన కరోతు సూరప్పనాయుడు తన అనుచరులతో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైసిపిలో చేరారు. సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ పొత్తులు సక్రమంగా లేకపోవడంతో వైసిపిలో చేరుతున్నట్లు సూరప్పనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, మండల యూత్ ప్రెసిడెంట్ చందక స్వామి, బంటుబిల్లి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, సింగనబంద పంచాయతీ కృష్ణరాజుపేటలో బెస్ట్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 300 మందికి వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ పల్ల సూరిబాబు సోదరి పి.లక్ష్మి జ్ఞాపకార్థం నిర్వహించిన వైద్య శిబిరంలో ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా కన్వీనర్ డాక్టర్ కుప్పిలి సురేష్‌బాబు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పార్థసారథి, పురుషోత్తం, సంతోష్ రాజా, బి.వెంకటప్పడు, లక్ష్మణ్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బాబును కలిసిన కోరాడ

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు మంగళవారం టిడిపి అధినేత నారా చంద్రబాబును హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కలిశారు. నియోజక వర్గంలో పార్టీ పరిస్థితిని చంద్రబాబుకు వివరించినట్లు రాజబాబు ఒక ప్రకటనలో తెలిపారు. తన రాజకీయ భవిష్యత్తుకు గ్యారెంటీ ఇచ్చారని పేర్కొన్నారు.

చొరబడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : తమ భూమిలో అక్రమంగా చొరబడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపి, ఆర్‌డిఒలకు ఫిర్యాదు చేసినట్లు ఆనందపురం గ్రామానికి చెందిన మీసాల శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆనందపురం మండలం చందకలో ఉన్న తమకు చెందిన 67 సెంట్ల భూమిలోకి కొంతమంది కిరాయి వ్యక్తులు దౌర్జన్యంగా ప్రవేశించి సిసి కెమెరాలకు సంబంధించి వైర్లను తొలగించారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను నిలువరించాలని, కిరాయి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీస్, రెవెన్యూ అధికారులను కోరినట్లు తెలిపారు.

నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని చిప్పాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.37.56 లక్షలతో తూడెం జెడ్‌పి హైస్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతి గదిని సంస్థ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్.రావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ నిర్మించిన ఈ భవనంలో తరగతులతోపాటు గ్రంథాలయం, లేబొరేటరీకి వినియోగించుకోవచ్చని వివరించారు. అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత చదువులు చదవాలని విద్యార్థులను కోరారు. పాఠశాల హెచ్ఎం అప్పన్న, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, కె.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సరిపల్లిలో గుంటూరు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహారావు తన సొంతూరు సరిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ వీధుల్లో తిరుగుతూ ప్రజలను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మాజీ సర్పంచ్ మాజీ ఎంపిటిసి సభ్యులతో పాటు, పాల ఉత్పత్తిదారుల సంఘం మాజీ అధ్యక్షుడు కలిగి శివ, సత్యనారాయణ, ప్రస్తుత ఎంపిటిసి సభ్యులు గొల్లవిల్లి వెంకట రమణ తదితర పెద్దలను కలిసి వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. సత్తివానిపాలెంలో పలువురు ప్రముఖులను కలిసి మద్దతు కోరారు.

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. వాంబే కాలనీకి చెందిన ఎస్.శ్యామల సోమవారం ఉదయం ఆసుపత్రికి వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. మిథిలాపురి ఉడా కాలనీ 100 ఫీట్ రోడ్డు వద్ద సోమవారం రాత్రి డ్రయినేజీ కెనాల్ ఎదురుగా 40 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని పురుషుని మృతదేహం ఉందని సిఐ వివరించారు. మృతుడు బ్లాక్, బ్లూ కలర్ నెక్ టి షర్ట్ డార్క్ బ్లూ లోయర్‌తో ఉన్నాడని, కొన్ని ట్యాబ్లెట్ స్ట్రిప్స్, జేబులో ఒక చిన్న వాటర్ బాటిల్ ఉన్నాయని తెలిపారు. సంబంధిత బంధువులు ఉంటే పిఎం పాలెం పోలీసులను సంప్రదించాలని సిఐ కోరారు. మృతదేహాన్ని కెజిహెచ్ శవాగారంలో భద్రపరిచినట్లు తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గిడిజాల పంచాయతీ వేమగోట్టిపాలెం గ్రామానికి చెందిన సుంకరి బాలకృష్ణ (39) గుండెపోటుతో మంగళవారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం... బాలకృష్ణ ఉపాధి హామీ పనులకు సంబంధించిన చెరువు పనికి మంగళవారం బయలుదేరుతున్న సమయంలో ఉదయం 7:30 సమయంలో ఛాతిలో నొప్పి వచ్చింది. దీంతో కుటుంబీకులు వెంటనే ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య లక్ష్మి కూలి పనులు చేస్తోంది. కుమార్తె, కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. బాలకృష్ణ మృతి చెందడంతో నిరుపేదలైన ఆ కుటుంబ సభ్యులు ఆధారం కోల్పోయారని, అధికారులు స్పందించి ఆ కుటుంబానికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముత్తంశెట్టి ప్రచారం

ప్రజాశక్తి -తగరపువలస : వైసిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం జివిఎంసి రెండో వార్డులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే 13న జరుగు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి స్థానిక ఎమ్మెల్యేగా తనను, విశాఖ లోక్‌సభ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వైసిపిని గెలిపిస్తే ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందని అన్నారు.సిఎం జగన్మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి, ఎస్.భాస్కరరెడ్డి, జి.వెంకటరెడ్డి, సరళారాణి తదితరులు పాల్గొన్నారు.

దళిత సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -భీమునిపట్నం : దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బిఎస్‌పి విశాఖ లోక్‌సభ అభ్యర్థి పి.శివప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి భాగం గోపాలరావు చెప్పారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాలనీలో మంగళవారం పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్, జ్యోతీరావుపూలే, కాన్షీరామ్ ఆశయాలను మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు తమ విజయం దోహద పడుతుందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో తమను గెలిపించాలని కోరారు. భీమిలి అభివృద్ధి, దళితుల సమస్యలపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సూరిబాబు, దుర్గారావు, రమేష్, నరసింగరావు, శివ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. ఎస్‌విఎల్ఎన్ఎస్ జిడిసి-2024 పేరిట ఈ నెల 6వ తేదీ వరకు జరుగు టోర్నమెంట్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలి మ్యాచ్ గంభీరం, బ్యాంక్ కాలనీ జట్లు మధ్య జరగ్గా బ్యాంక్ కాలనీ జట్టు గెలుపొందింది. టోర్నమెంట్‌లో మొత్తంగా 12 జట్లు పాల్గొంటాయని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి గౌరీశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణే ప్రధాన కర్తవ్యం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ కార్మికుల ప్రధాన కర్తవ్యమని పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 1146వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ప్లాంట్ డబ్ల్యుఆర్ఎం- 1, 2 విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా పోరాటాన్ని కార్మికులు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయం కావడంతో ఈ పోరాటానికి ప్రాధాన్యత అవసరమన్నారు. పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టడానికి ఇదే సరైన సమయమని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- వేపగుంట : పురుషోత్తపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ నిర్వహణ, చెట్లు నరికివేత పనుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. పురుషోత్తపురం, గోకులదాంకాలనీ, టీచర్స్ కాలనీ, శానతివానిపాలెం తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు

టిడిపి మద్దతు కోరిన పంచకర్ల

ప్రజాశక్తి-వేపగుంట : టిడిపి, జనసేన, బిజెపి కూటమి పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు మంగళవారం 93వ వార్డు టిడిపి కార్పొరేటర్ రాపర్తి కన్నాను నాయుడుతోటలోని ఆయన స్వగృహంలో కలిసి మద్దతు కోరారు. తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కన్నాను పంచకర్ల రమేష్‌బాబు కోరారు. 2009లో నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యానని గుర్తుచేశారు. నియోజకవర్గంలో తనకు పాత పరిచయాలు ఉన్నాయన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తితో త్వరలో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాపర్తి శైలజ, కర్రి పైడిరాజు, రాజు, మహేష్, యర్రా నాగరాజు, పి.జగన్మోహన్‌పాత్రుడు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

40వ వార్డులో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 40వ వార్డు పరిధి కాకరలోవలో పశ్చిమ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ మద్దతుగా ఆయన సోదరి, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రమకుమారి మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అందించారన్నారు. పశ్చిమ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 40వ వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపుసంఘం అధ్యక్షులుగా సోములు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్ తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షునిగా నందవరపు సోములు ఎంపికయ్యారు. పద్మనాభనగర్‌లో మంగళవారం జరిగిన తూర్పు కాపు సంక్షేమ సంఘం సమావేశంలో నందవరపు సోములును సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నందవరపు సోములు మాట్లాడుతూ, కాపుల ఐక్యతకు అందరూ కృషి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారంలో తన వంతు పాత్రను సమర్థవంతంగా పోషిస్తూ సంఘం అభివృద్ధికి పాటు పడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కంపర అప్పారావు, కంచిపాటి నాగరాజు, మడక తాతారావు, కంపర కనకరాజు, గొల్లవిల్లి వెంకట్రావు, కంచిపాటి వెంకటరమణ, కట్ట పెంటయ్య సాలాపు శ్రీనివాసరావు, కంపర నర్సింగరావు, నందం అప్పారావు, గని శెట్టిఅప్పలరాజు, మడక భాస్కరరావు, శ్రీపతి రాజేష్ పాల్గొన్నారు.

మహిళల హక్కులు పరిరక్షించేలా మ్యానిఫెస్టోలుండాలి

ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి

ప్రజాశక్తి -గాజువాక : మహిళల హక్కులు పరిరక్షించేలా రాజకీయ పార్టీల మేనిఫెస్టోలు ఉండాలని ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి డిమాండ్‌చేశారు. జివిఎంసి 71వ వార్డు పరిధి శ్రీనగర్ (శ్రీరామ్‌నగర్)లో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ 2024లోనే అమలుచేస్తామని, మహిళా చట్టాలు పటిష్టంగా అమలుచేస్తామని మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. గత 40 ఏళ్లుగా ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ నిర్మించలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయటానికి పూనుకున్నాయని విమర్శించారు. ఇప్పటికే ఉద్యోగాలు లేక యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉన్న సంస్థలను ప్రయివేటీకరిస్తే ఉద్యోగ అవకాశాలు ఎక్కడ ఉంటాయని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారానికి వస్తున్న రాజకీయ నాయకులను ఈ సమస్యలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి, రజిని, ఉమా, లక్ష్మి, మంజు, సుగుణ, రేవతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వై.సత్యవతి

కార్గో నిర్వహణలో గంగవరం పోర్టు రికార్డు

ప్రజాశక్తి -గాజువాక : అదానీ గంగవరం పోర్టు ఈ ఆర్థిక సంవత్సరంలో 7,473 రేక్‌లను నిర్వహించడంతోపాటు ఇయర్ ఆన్ ఇయర్ 20 శాతం వృద్ధిని సాధించి కొత్త రికార్డును నెలకొల్పిందని పోర్టు అధికారులు మంగళవారం ప్రకటన విడుదలచేశారు. అదానీ గంగవరం పోర్ట్ లిమిటెడ్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి అత్యధిక వార్షిక కార్గో 37.24 మిలియన్ మెట్రిక్ టన్నులు సాధించడానికి, ఇయర్ ఆన్ ఇయర్ 15 శాతం వృద్ధిని సాధించడానికి ట్రాక్‌లో ఉందని పేర్కొన్నారు. పోర్టు కంటైనర్ ట్రేడ్‌లో అత్యుత్తమ సేవలను అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. బుధవారం అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ కంటైనర్ స్కానర్ ఫెసిలిటీని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ రైల్వే సౌకర్యంతో 5 లక్షల టిఇయు సామర్థ్యం కలిగిన కంటైనర్ టెర్మినల్ తమ మొదటి ఎగ్జిమ్ కంటైనర్ సర్వీస్‌ను ఈ నెల 17న ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ టెర్మినల్ పరిశ్రమకు కొత్త వాణిజ్య మార్గాలు, అంతర్జాతీయ మార్కెట్‌లను అనుమతిస్తుందని వివరించారు. సమర్థవంతంగా కార్గో హేండ్లింగ్, రైల్వే సౌకర్యాల కోసం మౌలిక సదుపాయాలలో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టడం వల్ల పోర్టు మునుపటి రికార్డులను అధిగమించగలిగిందని పేర్కొన్నారు. వినియోగదారులకు అత్యుత్తమ సేవలను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. వేగవంతమైన టర్నరౌండ్ సమయం, డెలివరీతో పాటుగా సమర్థవంతమైన పోర్ట్ కార్యకలాపాలు, తరలింపు వ్యవస్థలతో కలిపి భారతీయ దిగుమతిదారులకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలను అందిస్తున్నామని పేర్కొన్నారు.

వాలంటీర్ల సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి-వేపగుంట : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాలంటీర్ల నుంచి సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. జోన్-8 పరిధిలోని 73 సచివాలయాల సముదాయాల్లో పనిచేస్తున్న 1314 మంది వాలంటీర్ల నుంచి వాటిని స్వాధీనం చేసుకొని కలెక్టర్ కార్యాలయానికి తరలించామని జోన్-8 ఎపిడి శ్రీరామ్ తెలిపారు. కొంతమంది వద్ద సిమ్ కార్డులు లేకపోవడంతో ఎఫ్ఐఆర్ కాపీలు తీసుకున్నామని పేర్కొన్నారు.

గణేష్‌నగర్‌లో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి మహతీ కాలేజీ ఆవరణలో గణేష్‌నగర్ కాలనీ వాసులతో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గెలిపించాలని శ్రీధర్ కోరారు. ఆనంద్‌కుమార్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన నుంచి తన సొంత నిధులతో పెన్షన్లు పంపిణీ చేశారని తెలిపారు. అనంతరం నాయకులు కార్యకర్తలతో కలిసి కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్.కృష్ణ, జియ్యాని మారుతి, శ్రీదేవివర్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.52 లక్షలు పట్టివేత

ద్విచక్రవాహనంపై తరలిస్తున్న నగదును పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి-సీతమ్మధార : స్కూటీపై భారీగా తరలిస్తున్న నగదును ద్వారకా నగర్ జంక్షన్‌లో పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ద్వారకానగర్ మొదటి లైన్ జంక్షన్ వద్ద ఇద్దరు స్కూటీలో భారీగా నగదును తరలిస్తున్నట్టు మంగళవారం స్థానిక పోలీసులకు సమాచారం అందింది. దీంతో ద్వారక సిఐ రమేష్, సిబ్బందితో అక్కడికి చేరుకొని తనిఖీ చేపట్టారు. స్కూటీలో నగదు తరలిస్తున్న ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. స్కూటీని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును సీతంపేటలోని గణపతి ఆలయం సమీపంలోని చిట్‌ఫండ్ కంపెనీ నుంచి తీసుకొని వెళ్తున్నట్టు పట్టుబడిన వారు పోలీసులకు చెప్పారు. ఈ నగదు రూ.52 లక్షలని తెలిసింది. దీనిపై విచారణ చేస్తున్నామని, వివరాలు తెలియజేస్తామని ద్వారకా సిఐ రమేష్ చెప్పారు. ద్వారక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఉత్తరం'లో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 55వ వార్డు పరిధి కంచరపాలెం జాఫువానగర్‌లో వార్డు కార్పొరేటర్ కెవిఎన్ శశికళతో కలిసి ప్రచారం చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో మురికివాడలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. గడిచిన ఐదేళ్లపాటు నిత్యం ప్రజల్లోనే ఉన్నానని, రానున్న రోజుల్లో కూడా ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, నాయకులు కెపి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, జామి దాసు, గంగ మహేష్, వై సిద్ధార్థరాజు, జుంజూరు గోవిందు, ఎడ్ల శ్రీనివాసరెడ్డి, ఎం.సునీల్, అంబటి శైలేష్, మధు, బోగవల్లి గోవింద్, ఎస్‌వివి రెడ్డి, బి.శివ ప్రసాద్, సొండి సురేష్, వైఎవిఎన్ రాజు, రత్నాకర్ రెడ్డి, కె.రాంబాబు, దివాకర్‌రెడ్డి, మహాదాస్య గోపి, లక్ష్మి, కరుణ, సతీష్, బొట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.

వాసుదేవనగర్‌లో ఆత్మీయ సమావేశం

జివిఎంసి 45వ వార్డు పరిధి వాసుదేవ్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద కార్పొరేటర్ కంపా హనుక్ ఆధ్వర్యాన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాంత ప్రజలు, గ్రామ పెద్దలతో కెకె.రాజు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేపట్టిన కార్యక్రమాల గురించి వారికి వివరించారు. పేదల కష్టాలు తీర్చే పార్టీలను ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, నాయకులు ఆళ్ల శివ గణేష్, పైడి రమణ, హరి పట్నాయక్, అంబటి శైలేష్, సన్నీ, ఈశ్వరరావు, నానిబాబు, దుర్గ, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో సమావేశం

వైసిపి సీనియర్ నాయకులు జివి.రవిరాజు ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ ఎన్నికల కార్యాలయంలో క్రీడాకారులతో కెకె.రాజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆడుదాం ఆంధ్రా పేరుతో మట్టిలో మాణిక్యాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెలికితీశారని వివరించారు. పేద ప్రజలు కూడా క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆలోచన చేసిన నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. నిజాయితీతో పనిచేసే వారిని ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, బులుసు జగదీష్, గుజ్జు వెంకటరెడ్డి, పైడి శ్రీను, కె మురళీకృష్ణారెడ్డి, వసంతల అప్పారావు, ఎం.లక్ష్మి, భద్రి, రామకృష్ణ రెడ్డి, అశోక్ రెడ్డి, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న కెకె.రాజు

నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికలలో అధికారులు, సిబ్బంది ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా ఆత్మస్థైర్యంతో, నిబద్ధతతో పోలింగ్ నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సూచించారు. కలెక్టరు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీల శిక్షణా తరగతులకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎటువంటి జంకు, భయం లేకుండా ధైర్యంగా పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులకు విధులపై శతశాతం నమ్మకం, నిబద్ధత కలుగజేయాలని సూచించారు. చెక్ లిస్ట్ తీసుకోవడం, తిరిగి అప్పగించడం, మాక్ ఓటింగ్ జరపడంతో పాటు పోలింగ్ ప్రారంభానికి ముందు, ముగిసిన తరువాత ఏమేమి చేయాలో క్షుణ్ణంగా అవగాహన కలిగించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం తనిఖీ చేసి చూపించడం, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు తెలియజేయడం పక్కాగా జరిగే విధంగా తర్ఫీదివ్వాలన్నారు. తరచుగా చోటుచేసుకునే తప్పులు, అవి జరుగకుండా చేపట్టవలసిన జాగ్రత్తలను చెప్పాలని సూచించారు. పోలింగ్ ప్రారంభమైన తరువాత ఎక్కువమంది వుంటే, ఏవిధంగా నియంత్రించవచ్చు, వికలాంగులు ముఖ్యంగా అంధుల ఓటింగ్‌లో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. అనంతరం అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.చిన్నికృష్ణ అసెంబ్లీ స్థాయిలో పోలింగ్ శిక్షణ విధి విధానాలను గూర్చి మాస్టర్ ట్రైనీలకు వివరించారు. ఈ శిక్షణకు 52 మంది మాస్టర్ ట్రైనీలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల డిఎం జయంతి, డిఎల్‌డివో నాగమణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంజుశ్రీని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నవోదయకు చైతన్య భారతి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని పెదముషిడివాడలో ఉన్న చైతన్య భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుతున్న ఏడుమెట్ల మర్రిపాలెం గ్రామానికి చెందిన బొబ్బరి మంజుశ్రీ నవోదయ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో 9వ తరగతికి ఎంపికైంది. ఈ మేరకు స్కూల్ కరస్పాండెంట్ రమణ మంగళవారం మంజుశ్రీని అభినందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మంజుశ్రీ లాగా మిగతా విద్యార్థులందరూ కష్టపడి చదివి పైకి రావాలన్నారు. పైస్థాయిలో వివిధ పోటీ పరీక్షల్లో విజయాలు సాధించి చైతన్య భారతి స్కూల్‌కి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న వైసిపి అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

వైసిపి అభ్యర్థి భరత్‌కుమార్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని ఊడేరు పంచాయతీ పరిధి అల్లిఖానుడుపాలెం, ఒమ్మివానిపాలెం గ్రామాల్లో అనకాపల్లి నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాల నాయుడును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనకు ఒక అవకాశం ఇస్తే అనకాపల్లి నియోజకవర్గంలో యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, పలకా రవి, గొల్లవిల్లి శ్రీనివాసరావు, పెద్దిశెట్టి గోవింద్, కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్ సిరిగిరిశెట్టి కృష్ణమోహన్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల ప్రచారం

వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మలసాల భరత్ కుమార్, బూడి ముత్యాలనాయుడు గెలుపే లక్ష్యంగా స్థానిక గవరపాలెంలో కార్పొరేటర్లు పీలా సౌజన్య రాంబాబు, కొణతాల నీలిమ భాస్కర్ మంగళవారం పోటా పోటీగా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి భరత్ కుమార్, ముత్యాల నాయుడును గెలవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కోట్ని బాలాజీ

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుతో హైదరాబాదులోని ఆయన నివాసంలో టిడిపి భీమిలి నియోజకవర్గం పరిశీలకులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు అనకాపల్లి, భీమిలి నియోజకవర్గాలలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు గురించి ఆరా తీశారు. బాలాజీ భవిష్యత్తు కార్యాచరణ గురించి మాట్లాడటం జరిగింది. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే యువత భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధి గురించి చర్చించినట్టు బాలాజీ తెలిపారు.



చంద్రబాబుతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ

ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వాలని వినతులు

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి- కె.కోటపాడు

వృద్ధులు, వికలాంగుల పింఛన్లను వారి ఇంటి వద్దకే వెళ్లి అందించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో అప్పలరాజుకు మాడుగుల నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావు మంగళవారం వినతి పత్రం అందించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నేరుగా నగదు పంపిణీ చేసే కార్యక్రమాలను వాలంటీర్ వ్యవస్థ నుండి తప్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో వారికి ప్రభుత్వం అందించిన సెల్‌ఫోన్లు సిమ్ కార్డులు తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు. పింఛన్లను సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇళ్ల వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సబ్బవరపు రామునాయుడు, లెక్కల మల్లేశ్వరరావు, బండారు నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్ ఇవ్వాలని కోరుతూ స్థానిక ఎంపీడీవోకు మంగళవారం టిడిపి నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు జి.మల్లునాయుడు మాట్లాడుతూ పింఛన్‌దారులకు పెన్షన్లు అందకుండా టీడీపీ చేసిందని రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొడ్డేట నాగ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని వృద్ధులు, వికలాంగులు, ఇతర పెన్షన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి నాయకులు మంగళవారం మండల పరిషత్తు పర్యవేక్షణ అధికారి జివి.రమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, చల్లా నానాజీ, చామంతుల వెంకన్న దొర, గొర్లె దేముళ్ళు, బండారు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- కశింకోట

తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, సీఎం రమేష్‌లను గెలిపించాలని కోరుతూ మండలం చింతలపాలెం గ్రామంలో ఆయా పార్టీల నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, కర్రి దురునాయుడు, మేడిశెట్టి వెంకటరమణ, జెర్రిపోతుల నూకునాయుడు, మహిళలు పాల్గొన్నారు. అలాగే మండలంలో సుందరయ్యపేట గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో మాజీ ఎంపీపీ కూడ్రపు రామునాయుడు సమావేశం నిర్వహించి కొణతాల రామకృష్ణ, సిఎం.రమేష్‌లను గెలిపించాలని కోరారు. సమావేశంలో కాయల మురళి, నైనంశెట్టి రమణరావు, రెడ్డి సూర్యనారాయణ, కర్రి గోవింద, గాల్లా రాజు, కరక సత్యనారాయణ పాల్గొన్నారు.

అట్టలు పెట్టి తెల్ల దోమలను అరికట్టవచ్చు

ప్రజాశక్తి- కె.కోటపాడు : పొలంలో పసుపు జిగురు అట్టలు పెట్టుకోవడం ద్వారా తెల్లదోమలను అరికట్టవచ్చని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల కింజరావు యర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు తెలిపారు. ఈ మేరకు మండలంలోని వారాడలో మంగళవారం గ్రామీణ వ్యవసాయ పని అవగాహన, అనుభవం అనే కార్యక్రమాన్ని సదరు విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పసుపు జిగురు అట్టలు పొలంలో అమర్చడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. ఎకరానికి ఎకరానికి 10-12 అట్టలు పెట్టుకొని సామూహిక ట్రాపింగ్ చేయొచ్చన్నారు. 4-5 ఎకరాలకు పెట్టుకొని తెల్లదోమ ఉధృతిని తెలుసుకొని దానిని బట్టి పురుగు మందులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం పిసి డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ యన్.కిష్టార్ కుమార్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆఫ్రిద్, వినోద్, రమణ, రవి కుమార్, పరప్రసాద్, సోమశేఖర్, రైతులతో పాల్గొన్నారు.

కొణతాలకు ఎంఆర్‌పిఎస్ మద్దతు

ప్రజాశక్తి- అనకాపల్లి : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధినేత మంద కృష్ణమాదిగ ఆదేశాలు మేరకు కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మద్దతు ఇస్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో కొణతాల రామకృష్ణను కలిశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు మారెడుపూడి రమేష్ బాబు, తొత్తరమూడి శ్రీనివాస్, యలకమల్లి బాబు, కొల్లి చిన్నఅప్పారావు, ఏలుసూరి గాటీలు, కట్టుమూరి మంగరాజు, చేవ్వేటి అప్పారావు, గంపల రాజు, కాకినాడ కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వారాహి విజయభేరి యాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ చేపట్టిన వారాహి విజయభేరి ప్రచార యాత్ర ఈ నెల 5న అనకాపల్లి వస్తుందని, దానిని విజయవంతం చేయాలని కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక రింగ్ రోడ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సుంకరమెట్ట నుంచి మెయిన్ రోడ్డు మీదుగా నెహ్రూ చౌక్ జంక్షన్ చేరుకుని అక్కడ భారీ బహిరంగ సభలో మాట్లాడుతారని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఆయా పార్టీల నాయకులు పొన్నగంటి అప్పారావు, బుదిరెడ్డి చిన్న, డాక్టర్ నారాయణరావు, గంజి సత్యరావు, దూలం గోపి, మాదంశెట్టి నీలబాబు పాల్గొన్నారు.

వైసిపి శ్రేణులతో ధర్మశ్రీ, బూడి సమావేశం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ శ్రేణులతో చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కూటమి అభ్యర్థులందరూ సీఎం రమేష్ అందించే సొమ్ముకు దాసోహమయ్యారని ఆరోపించారు. రూ.56 కోట్ల నిధులతో గ్రామ గ్రామానికి అనుసంధానం చేసే రోడ్లను వైసిపి ప్రభుత్వం మంజూరు చేసిందని, టిడిపి గుత్తేదారులు ఉద్దేశపూర్వకంగా పనులు నిలుపుదల చేయించి ప్రభుత్వానికి చెడ్డ పేరు కలిగే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ బండారు సత్యనారాయణ, దొడ్డి వెంకటరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యరావు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ

కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంచాలి

జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి -అనకాపల్లి

అధ్యాపకులు, విద్యార్థుల వ్యవహార శైలి, మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ చేసి విద్యార్థుల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంచాలని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో విద్యా సంస్థల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులతో ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి, ర్యాగింగ్, వివిధ రూపాల్లో జరిగే వేధింపులు తదితర సమస్యలను తెలిపేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యాజమాన్యం, బోధన సిబ్బంది విద్యార్థుల భద్రత విషయంలో ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. దీని వల్ల విద్యార్థులకు ఒత్తిడి, ఇతర భయాలు పోయి వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థినుల సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో ఆలకించి సురక్షితమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ర్యాగింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలపైనా, శారీరక, మానసిక నష్టాలు, సంబంధిత చట్టాలు, శిక్షలు గూర్చి అవగాహన కల్పించాలన్నారు. విద్యాసంస్థల్లో సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, టెర్రస్ పైకి, వాటర్ ట్యాంకుల వద్దకు విద్యార్థులు ఎవరూ వెళ్లకుండా రక్షణ చర్యల్లో భాగంగా తాళాలు వేసి ఉంచాలని సూచించారు. విద్యాసంస్థలలో ఏర్పాటు కాబడిన ర్యాగింగ్ నిరోధక కమిటీలు, మాదక ద్రవ్య నిరోధక కమిటీలు మరింత సమర్ధవంతంగా పనిచేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనకాపల్లి జిల్లా పోలీస్ మొబైల్ ప్రచార వాహనం ద్వారా గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో, మహిళలపై జరిగే నేరాల చట్టాలు, సైబర్ క్రైమ్స్ విషయాలపై అవగాహన కల్పిస్తున్నందున విద్యాసంస్థలు ఈ సేవలను మరింత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, డిఎస్‌పిలు ఎస్.అప్పలరాజు, కె.వి.సత్యనారాయణ, జిఆర్ఆర్.మోహన్, బి.అప్పారావు, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, వివిధ కళాశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

టెన్త్ మూల్యాంకాన్ని పరిశీలిస్తున్న విజయభాస్కర్, డిఇఒ

టెన్త్ మూల్యాంకం పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా కేంద్రంలో గవరపాలెం బాయ్స్ హైస్కూల్, బాలికోన్నత పాఠశాల, ఏఎంఏఎల్ హైస్కూల్ మూడు కేంద్రాల్లో జరుగుతున్న 10వ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని జోన్ 1 ప్రాంతీయ విద్యా సంచాలకులు విజయ భాస్కర్ మంగళవారం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. రెండు కేంద్రాల్లో 5 సబ్జెక్టుల గ్రూపులను పరిశీలించారు. ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తున్న సమాధాన పత్రాలను ప్రిన్సపల్స్ ఆఫ్ వాల్యువేషన్ ప్రాప్తికి దిద్దుతున్నారా లేదా అన్న అంశాన్ని, మార్కుల టోటల్స్‌ని చాలా నిశితంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో ఉపాధ్యాయులకు చేకూర్చిన ఏర్పాట్లపై కూడా సమీక్షించారు. పరీక్షా కేంద్రాల్లో ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేసిన చల్లని రక్షిత మంచినీరు, మజ్జిగ ఏర్పాట్లను, మూల్యాంకన గదుల్లో విద్యుత్, ఫ్యాన్ల సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల్యాంకనను సక్రమంగా చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిని ఎం వెంకట లక్ష్మమ్మ, ఏడి రవి బాబు, తదితరులు పాల్గొన్నారు.

పలువురు వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి- కశింకోట

మండలంలో ఉగ్గినిపాలెం గ్రామంలో ఆరుగురు గ్రామ వాలంటీర్లు మంగళవారం రాజనామా చేశారు. వీరిలో ఉష నాగ జగదీష్, జల్లూరి రవికుమార్, గాలి కుమార్, గగనం రంగా, బత్తిన నాయుడు, ఒమ్మి అప్పలనాయుడు ఉన్నారు. అలాగే బయ్యవరం గ్రామ వాలంటీర్లు కశింకోట ఎంపిడిఒ శేషు బాబుకు రాజీనామా లేఖలను అందజేశారు.

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు వెంకటాపురంలో 21 మంది వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. స్థానిక కుమారి కల్యాణ మండపంలో జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును కలిసి రాజీనామా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వాలంటీర్లుగా చేస్తున్న తమను టిడిపి నాయకులు చాలా ఇబ్బందులు పెడుతున్నారని, అందుకే మూకుమ్మడిగా రాజీనామా చేశామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసిపి జెండా చేత పట్టి జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. వైసిపి గెలుపునకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు పార్టీ అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో దీనరాజుకు స్వర్ణ పతకం

ప్రజాశక్తి -అనకాపల్లి : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా, చిల్లకల్లులో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 93 కిలోల విభాగం అండర్ -17లో మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వి.దీనరాజు గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌వి.శ్రీధర్, ఉపాధ్యాయులు గొంది చినబ్బాయ్, పట్టాభి, స్వామి, కరుణ జ్యోతి, విజయలక్ష్మి, ప్రసాద్, లక్ష్మి తదితరులు మంగళవారం దీనరాజును అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌యం శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు దేహ దారుఢ్యం కూడా ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు.

దీనరాజును అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

టిడిపిలో చేరిన సంతోష్ అప్పారావు నాయుడు

సంతోష్ అప్పారావునాయుడుకు అభినందనలు చెబుతున్న పీలా

ప్రజాశక్తి -అనకాపల్లి : గవరపాలెం శతకంపట్టు జంక్షన్లోని గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ చైర్మన్, వైసిపి నాయకులు కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు మంగళవారం ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ గవరపాలెం గౌరి పరమేశ్వరులు ఉత్సవాలకు పూర్వవైభవం తీసుకువస్తానని తెలిపారు. సంతోష్ అప్పారావు నాయుడుకు మంచి భవిష్యత్తు ఉంటుందని హామీ ఇచ్చారు. పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ సంతోష్ సొంతగూటికి రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బాలాబాబు, జోగి నాయుడు, సురేంద్ర, మంగా ఈశ్వర్, ఉగ్గిన రమణమూర్తి, పివి రమణ, బుద్ధ భూలోక నాయుడు, బుద్ధ రాజేష్, గొంతిన శ్రీను పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

దేవరాపల్లి : మండలంలోని ఎన్.గజపతినగరంలో వైసిపికి చెందిన 13 మంది కార్యకర్తలు మంగళవారం మాడుగుల కూటమి అభ్యర్థి పైలా ప్రసాదరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పైలా ప్రసాద్‌రావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరి వారిలో కార్లి త్రినాధ్, వంటాకు నారాయణరావు, గుంటి గోవిందు, కార్లి వర్ధన్, వేచలపు ఏసు, గుంటి వెంకటరమణ, వంటాకు ముత్యాల నాయుడు, వంటాకు దేముడు, వంటాకు నారాయణమూర్తి, బత్తి సత్యంనాయుడు, బరిడి త్రిమూర్తులు, వేచలపు గణేష్, వేచలపు అప్పారావు ఉన్నారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్లపై వైసిపి దుష్ప్రచారాన్ని మానుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇచ్చే పింఛన్ విషయంలో టిడిపిపై వైసిపి దుష్ప్రచారం మానుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీష్ హితవుపలికారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష 35 వేల మంది సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పింఛన్లు ఒకటవ తేదీన వారి ఇంటికి చేర్చేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని చెప్పారు. కాని వాలంటీర్లపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడం వల్ల దాన్ని సాకుగా తీసుకొని టిడిపి అధినేత చంద్రబాబు పెన్షన్ దారులకు ఒకటో తేదీని పెన్షన్ అందకుండా చేస్తున్నారని ప్రచారం చేయడం దారుణమన్నారు. ఒకటో తేదీ ఎప్పుడొస్తాదో అని చూస్తున్న పేదల కడుపు కొట్టి పెత్తందారులకు కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తన దుర్మార్గాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎన్నికల కమిషన్‌పైనా, నిమ్మగడ్డ రమేష్ కుమార్‌పైనా, తెలుగుదేశం పార్టీ పైనా దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే పంపిణీ చేయాలని నాగ జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆటిజంపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : ఆటిజంపై అవగాహన కలిగి ఉండాలని ఎంఇఒ కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొప్పాక భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా ఎంఇఒ కోటేశ్వరరావు అధ్యక్షతన ఆటిజంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కె.కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుమమణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుడుతున్న 100 మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం వచ్చే అవకాశం ఉందన్నారు. బాలికలతో పోల్చుకున్నట్లయితే బాలురులో 400 రెట్లు ఎక్కువగా వృద్ధి చెందుతుందని చెప్పారు. ఆటిజం రావడానికి జన్యుపరమైన కారణాలతో పాటుగా సామాజిక పర్యావరణ కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆటిజం నివారించడానికి "తల్లిదండ్రులు" ప్రత్యేక ఉపాధ్యాయులు, సైకలాజికల్ కౌన్సిలర్ల సహాయ సహకారంతో సైకలాజికల్ థెరపి, కౌన్సిలింగ్, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపీ ఇప్పించాలని సూచించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు బివి వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ పనులు తాము చేసుకునే విధంగా, ఏకాగ్రత పెంచే విధంగా, హైపర్ ఆక్టివ్‌నెస్‌ని తగ్గించి సామాజిక పునరావాసం చేసేందుకు అవకాశం ఉందని వివరించారు. తల్లిదండ్రులు మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా పిల్లలకు అండదండగా ఉండాలన్నారు. జీవన శైలిని మార్చుకొని పిల్లలకు ఉద్వేగ భద్రత కల్పించాలని, ప్రత్యేక ఉపాధ్యాయుల సలహా, సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు యస్.యేసురత్నం, సిహెచ్.రమాదేవి, 20 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పటాన్‌శెట్టి మంగళవారం బుచ్చయ్యపేట మండలంలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. మండలంలోని వడ్డాది, రాజాం, బుచ్చియ్యపేట పోలింగ్ కేంద్రాలైన ప్రభుత్వ స్కూళ్లను సందర్శించి అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు, మరుగుదొడ్లు, విద్యుత్తు, తాగునీటి సదుపాయం ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, అతిపెద్ద పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్పీ కేవీ.మురళీకృష్ణ, ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులున్నారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట జంక్షన్‌లో బుచ్చయ్యపేట ఎస్సై డి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం సిఐఎస్ఎఫ్ పోలీసులు వాహనాలు తనిఖీలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచిపెట్టారు.

4 నుండి అంగన్వాడీ కేంద్రాలు ఒంటిపూట

ప్రజాశక్తి-దేవరాపల్లి : వేసవిలో ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో అంగన్వాడీ కేంద్రాలను ఒంటి నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏప్రిల్ 4 నుంచి మే 31వ తేదీ వరకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అంగన్వాడీ కేంద్రం నడుస్తుంది. అంగన్వాడి కార్యకర్తకు మే 1 నుండి 15వ తేదీ వరకు, అంగన్వాడీ హెల్పర్‌కు మే 16 నుండి 30వ తేదీ వరకు వేసవి సెలవులు ఇవ్వడం జరిగింది.

రాజకీయ పార్టీలతో ఆర్‌డిఒ సమావేశం

ప్రజాశక్తి-చోడవరం : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలు అనుచరించవలసిన నియమ నిబంధనలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అనకాపల్లి ఆర్‌డిఒ ఎజె చిన్నికృష్ణ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం, పార్టీ అభ్యర్థులు అనుసరించవలసిన పద్ధతులపై ఎన్నికల కమిషనర్ రూపొందించిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ వేణుగోపాల్, వైసిపి నుండి పప్పల రమణమూర్తి, టిడిపి నుండి బొడ్డేటి నాగ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

పైడిమాంబ అమ్మవారి మారు వారం పండగ

ప్రజాశక్తి- పరవాడ : మండల కేంద్రం పరవాడ గ్రామం పైడిమాంబ అమ్మవారి మారువారం పండుగ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాసరావు దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, నాయకులు చుక్క రాము నాయుడు, గెడ్డం ఉమ, రెడ్డి శ్రీనివాసరావు, చల్ల కనకరావు, వడ్డి హరి, దీపురుపల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

▶▶ఎన్నికల హడావుడిలో అధికారులు ▶▶ఇదే అదునుగా నిర్మాణాలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రధాన కూడలి సమీపంలోనే సర్వే నెంబరు 161 గెడ్డపారంబోకు భూములు సహా ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న కాలువను ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు స్థానికుల నుండి ఫిర్యాదులు అందినా తూతూ మంత్రంగా చర్యలు తీసుకొని వదిలేయడంతో యధావిధిగా మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రధాన రహదారిని అనుకుని సచివాలయానికి వెళ్లే దారిలో సుమారు 800 మీటర్ల వరకు గెడ్డ పోరంబోకు స్థలం దాదాపుగా ఆక్రమణలకు గురైనా రెవెన్యూ, పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కలెక్టర్‌కు గ్రామస్తులు పలువురు ఫిర్యాదు చేయగా ఆనాడు తహసిల్దార్ జానకమ్మ నిర్మాణాలు కొనసాగకుండా అడ్డుకుని నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అధికారులు అటువైపు చూడలేదు. ఇదే అదునుగా గెడ్డ పోరంబోకు భూములలో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అధికారులు పర్యవేక్షణ చేయక పోవడంతో ఆక్రమణలు నానాటికి పెరుగుతున్నాయి. విలువైన భూములను రెవెన్యూ అధికారులు కాపాడలేక పోతున్నారని విమర్శలు సైతం గట్టిగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ప్రధాన కూడలి వద్ద పంచాయతీ నిధులతో నిర్మాణం చేపట్టిన బస్సు షెల్టర్, మరుగుదొడ్లు సైతం ఆక్రమణకు గురయ్యాయి. ప్రస్తుతం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పోయే వారికి మరుగుదొడ్లు సైతం లేక పోవడంతో వృద్ధులు, మహిళలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్న వారిపై చర్యలు చేపట్టి తీసుకోవాలని స్థానికులు సహా పలు సంఘాల నాయకులు కోరుతున్నారు.

గెడ్డపోరంబోకు స్థలంలో చేపడుతున్న నిర్మాణం

కాలువకు అడ్డంగా కడుతున్న కట్టడం

గెడ్డ స్థలంలో చేపడుతున్న నిర్మాణం

కూలీలతో మాట్లాడుతున్న ఎపిడి

కూలీలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: వేసవి దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలని ఎపిడి మణికుమార్ సూచించారు. రావికమతం మండలంలోని కవగుంట గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజు ఉదయాన్నే పనులకు వచ్చి ఎండ దెబ్బ తగలకుండా పనులను చేసుకోవాలన్నారు.నీటి నిల్వ కుంట పనులను ఎక్కువగా గుర్తించి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీటితో పంట పొలాలు బాగా పండి దిగుబడి వస్తాయన్నారు. జాబు కార్డు కలిగిన కూలీలకు వంద రోజుల పని కల్పించడమే కాకుండా రోజుకు రూ.300 చొప్పున 30 వేలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కాశి, ఈసీ కామేశ్వరరావు, టిఏ కొండాజి, రమణ, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు పలువురు పాల్గొన్నారు.

4న రోలుగుంట మండల సమావేశం

ప్రజాశక్తి-రోలుగుంట: ఈ నెల 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఈఓపిఆర్‌డి ఎన్.నూకరాజు తెలిపారు. ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జనసేన స్టీరింగ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - చీడికాడ: మాడుగుల నియోజకవర్గం జనసేన పార్టీ ఎన్నికల స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాయపరెడ్డి కృష్ణ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, స్టీరింగ్ కమిటీలో ప్రసాదు, దిబ్బిడి సన్యాసినాయుడు, గుమ్మడి సంతోష్, మజ్జి కృష్ణ, మురుకుర్తి అప్పారావులను నియమించారన్నారు. వీరు టిడిపి, జనసేన కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ గెలుపునకు కృషి చేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శికి గాయాలు

ప్రజాశక్తి - నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి గాయాలు అయ్యాయి. ఎస్.రాయవరం మండ లం రేవుపోలవరం పంచాయతీ కార్యదర్శి కర్రి శ్రీను బైక్ పై మంగళవారం పాయకరావుపేట నుండి డ్యూటీకి వెళుతున్నారు. నక్కపల్లి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వెళుతున్న ఆటో సడన్‌గా ఆపడంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదం లో కాలుకు బలంగా గాయమైంది. స్థానికులు గమనించి నక్కపల్లి సిహెచ్‌సికి హుటా హుటిన తరలించారు.

గాయపడ్డ కార్యదర్శి శ్రీను

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మండలం మెట్టపాలెం గ్రామంలోని టీడీపీకి చెందిన పలువురు మంగళవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం జగన్ అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తాతబాబు, కె.తాతాజీ, ఎస్.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ వైసిపి ఆఫర్ ఇచ్చింది

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: తనకు వైసీపీ నుండి ఎంపీ టికెట్ ఆఫర్ వచ్చిందని, తల్లిలాంటి టీడీపీని కోసం తిరస్కరించానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తాను చివరి శ్వాస వరకు టీడీపీలో ఉంటానన్నారు. ప్రభుత్వంలోని సలహాదారులే తనకు ఫోన్ చేశారని, ఎమ్మెల్యే గణేష్ మాటలను పట్టించుకోనవసరం లేదన్నారు. దీన్ని బట్టి చూస్తే నర్సీపట్నం ఎమ్మెల్యేకు పార్టీలో ఏ స్థానం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యే గణేష్ కు లేదన్నారు. నిధులు, జివోలు లేకుండా పనులు ప్రాంభించిన ఆరిలోవ రోడ్డు, మెడికల్ కాలేజ్, నర్సీపట్నం ప్రధాన రహదారి విస్తరణ బూటకమని తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ నిధులతో నాసిరకమైన రోడ్ల పనులు చేసి ఎమ్మెల్యే భారీ అవినీతికి పాల్ప డ్డారని ఆరోపిం చారు. అధికా రాన్ని అడ్డం పెట్టుకొని పేదల భూములను రెవెన్యూ రికార్డుల్లో మార్చి వాటిని సొంతం చేసుకోవాలని గణేష్ చూస్తున్నారన్నారు. అందరి దగ్గర అప్పులు తీసుకుని, ప్యాకేజీలతో మున్సిపల్ చైర్మన్ సీటును అమ్ముకున్న ఎమ్మెల్యేకు తమను విమర్శించే అర్హత లేదన్నారు. ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయడాన్ని చంద్రబాబు ఆపుతున్నారంటూ వైసీపీ నాయకులు విమర్శించడాన్ని తప్పుబట్టారు.

మాట్లాడుతున్న విజయ్

సెక్టార్ అధికారులు సమర్ధవంతంగా పనిచేయాలి

ప్రజాశక్తి పాడేరు : సార్వత్రిక ఎన్నికలను విజయ వంతం చేసే బాధ్యత సెక్టార్ అధికారులపైనే ఉందని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత స్పష్టం చేసారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అరకు నియోజక వర్గం సెక్టార్ అధికారులకు నియోజవర్గం స్థాయి మాస్టర్ ట్రైనీలకు పోలింగ్ ప్రక్రియ, ఈవిఎంల ఏర్పాటు, సెక్టార్ అధికారుల బాధ్యతలు, విధులపై మంగళవారం మూడవ విడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగుకు ముందు, తరువాత నిర్వహించ వలసిన ప్రక్రియలో సెక్టార్ అధికారులు సమర్ధవంతంగా పనిచేయాలని సూచించారు. పోలింగ్ రోజున ఈవి ఎంల నిర్వహణ, అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలింపుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలో బాధ్యతా రాహిత్యం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి లోటు పాట్లుంటే జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలని చెప్పారు. పోలింగ్ నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈవిఎంలు సక్రమంగా పోలింగ్ అధికారులకు అందిందీ లేనిదీ క్షణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. కంట్రోల్ యూనిట్, వివి పాట్, బ్యాలెట్ యూనిట్లను సంబంధిత పోలింగ్ కేంద్రానికి మ్యాపింగ్ చేసిన యంత్రాలు వచ్చిందీ లేనిది సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్లకు ముందుగానే సమాచారం అందించాలని చెప్పారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని పేర్కొన్నారు. ప్రతీ రెండు గంటలకు పోలింగ్ పర్సంటేజ్ వివరాలు, పోలింగ్ జరుగుతున్న తీరుపై జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలో ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్, అరకు నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, డిఆర్ఓ పద్మావతి, ఎస్‌సిలు వివిఎస్.శర్మ, పి.అంబేద్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అల్లూరి కలెక్టర్

ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

బాల్య వివాహాలపై ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట పిహెచ్‌సి వద్ద మంగళవారం బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బేటా బచావో బేటి పడావో అంటూ నినాదాలు చేశారు. బాల్యవివాహాలతో ఎన్నో ఇబ్బందులు ఉంటాయని, వీటికి ఎవరూ సహకరించ వద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్‌లు సావిత్రి, అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీసత్య, ఆశ, అంగన్వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టి. అర్జాపురంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట పిహెచ్‌సి పరిధి టి, అర్జాపురం గ్రామంలో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 384మండి రోగులు హాజరయ్యారు. వీరికి కొత్తకోట వైద్యాధికారి రజని, ప్రత్యేక వైద్యనిపుణులు కె.శ్రీనివాస్, చిన్నపిల్లల వైద్యులు నిఖిత, కంటి వైద్యులు సురేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ రామారావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొస్తున్న మత్స్యకారులు

మత్స్యకారుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-గొలుగొండ: తాండవ రిజర్వాయర్లో బోటు బోల్తా పడి గల్లంతైన గరగల అప్పారావు మంగళవారం శవమై తేలాడు. గొలుగొండ మండలం పొగచెట్ల పాలెం గ్రామానికి చెందిన గరగల అప్పారావు, జెన్ని పోతురాజులు ఆదివారం రాత్రి తాండవ రిజర్వాయర్లో చేపల వేటకు వెళ్లగా బోటు బోల్తా పడి గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ బోటు ప్రమాదంలో గరగల అప్పారావు ఆచూకీ తెలియక పోవడంతో గొలుగొండ ఎస్సై బి.కృష్ణారావు ఆధ్వర్యంలో పరిసర గ్రామాల మత్స్యకారులు రెండు రోజులుగా అప్పారావు ఆచూకీ కోసం తాండవా రిజర్వాయర్ అంతా జల్లెడ పట్టి గాలించారు. మంగళవారం ఉదయానికి గల్లంతైన అప్పారావు శవమై తేలడంతో మత్స్యకారులు శవాన్ని ఒడ్డుకు చేర్చారు.

విద్యార్థులతో పనులు!

-అప్పలరాజుపురం ఉన్నత పాఠశాలలో ఘటన

ఇటుకలు మోస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చీడికాడ: విద్యను నేర్చుకునేందుకు విద్యార్థులు బడికి వెళతారు. ఉపాధ్యాయుల పుణ్యమా అని విద్యార్థులతో పనులు చేయిస్తున్న దృశ్యాలు ప్రభుత్వ పాఠశాలలో చోటు చేసుకుంటున్నాయి. చీడికాడ మండలంలోని అప్పలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం చోటు చేసుకున్న ఈ సంఘటన సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాలలో నాడు నేడు పనులను నిర్వహిస్తున్నారు. పనుల నిర్వహణకు పెట్టిన కూలీలు రాకపోవడంతో విద్యా కమిటీ చైర్మన్ చెప్పారని పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు 9వ తరగతి విద్యార్థులతో పనులు చేయిస్తున్నారు. ఆ సమయంలో అక్కడికి వెళ్ళిన విలేకరులకు ఈ దృశ్యాలు కనిపించడంతో ఫోటోలు వీడియోలు తీశారు. సదరు ఉపాధ్యాయుడు వచ్చి మీరు ఎందుకు ఫోటోలు, వీడియోలు తీస్తున్నారు? నాడు నేడు పనులు జరుగుతున్నాయి రూమ్ లో ఉన్న టైల్స్ లు తీయిస్తున్నామని, అదేమీ తప్పు కాదు కదా అనడం గమనార్హం. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వచ్చి పాఠశాలలో పనులు జరుగుతున్నాయి. ఈ రోజు కూలీలు రాలేదు. దీంతో, పిల్లలతోతీయించాం అది తప్పు కాదు కదా అనడం విశేషం. దీనిపై మండల విద్యాశాఖ అధికారి బొంజు బాబును వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, విచారించి చర్యలు తీసుకుంటానన్నారు.

అబద్ధాలు చెప్పడం జగన్‌కు కొత్త కాదు

- టిడిపి విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం.శ్రీ భరత్

మాట్లాడుతున్న శ్రీ భరత్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: అబద్ధాలు చెప్పడం జగన్ మోహన్ రెడ్డికి కొత్త ఏమి కాదని విశాఖ పార్లమెంట్ ఉమ్మడి కూటమి అభ్యర్థి ఎం.శ్రీ భరత్ విమర్శించారు. మంగళవారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.200 ఉన్న పింఛను టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 వేలకు పెంచడం జరిగిందని చెప్పారు. ఎన్నికలకు ముందు మూడు వేలుకి పెంచుతానని చెప్పి ఐదు సంవత్సరాలు కాలయాపన చేసి ఎన్నికల సంవత్సరంలో పెంచారన్నారు. వాలంటీర్లు లేకపోతే పింఛన్లు ఇవ్వలేని అసమర్ధత ప్రభుత్వమా మీది అని ప్రశ్నించారు. వాలంటీర్లు లేకపోతే అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 50 వేల మంది ఉన్నారని,ప్రతి సచివాలయంలో పదిమంది ఉద్యోగులు ఉండి కూడా పింఛన్లు ఇవ్వలేదంటే ప్రభుత్వం దగ్గర డబ్బు లేకపోవడమే కారణం మని చెప్పారు.పింఛన్లను నేరుగా ఇవ్వాలనుకుంటే ఆన్ లైన్ విధానంలో కూడా పంపిణీ చేయొచ్చని అన్నారు.కొంతమంది వాలంటీర్లు వైసిపికి ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొంతమంది వాలంటీర్లు ఇప్పటికీ కూడా వారి దగ్గర ఉన్న ప్రభుత్వ పరికరాలు అప్పగించ లేదన్నారు.జగన్ కి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం దగ్గర సొమ్ములు లేవని, ఇప్పటివరకు ఉద్యోగులకు కూడా జీతాలు ఇవ్వలేదన్నారు. అనంతరం జిల్లా టిడిపి అధ్యక్షు గండి బాబ్జి మాట్లాడారు.

విశాఖలో వలస నేతల పోటీ

- అల్లు భానుమతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విశాఖపట్నంలో వలస నేతలు మాత్రమే పోటీ చేస్తున్నారని, స్థానికులకు టిక్కెట్లు ఇవ్వడంతో అక్కడి పరిస్థితులపై అవగాహన ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకురాలు అల్లు భానుమతి అభిప్రాయం వ్యక్తం చేశారు. బీచ్ రోడ్ ఓషన్ వ్యూ లే అవుట్ కాలనీలో ఆమె క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి పేరుతో కుట్ర పూర్తిమైన రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. నాయకులు ఏమి చేస్తే ప్రజలు అదే నమ్ముతున్నారని ఇది బాధాకరమన్నారు.పార్టీలు టిక్కెట్లు ఇవ్వడంలో సామాజిక న్యాయం పాటించకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు బీసి లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రజలు స్థానికులకే ఓటు వేయాలని కోరారు. స్థానికులను గెలిపించుకోవడంతో సమస్యలపై అవగాహన ఉంటుందని, వాటిని సాధించుకునేందుకు కూడా అవకాశం ఉంటుందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానికులకే టికెట్లు ఇచ్చిందన్నారు. చంద్రబాబు నాయుడు ఆయన సామాజిక వర్గానికి చెందిన వారికే టికెట్లు ఇచ్చారన్నారు.

ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్: పనులు లేకుండా ఉన్న సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికి పింఛన్లు అందజేయాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం వద్ద పెన్షన్‌కు డబ్బులు లేని పరిస్థితిని ప్రజలకు తెలియనివ్వకుండా, కేవలం ప్రతిపక్షాలు ఆపడంతోనే పంపిణీ చేయలేక పోతున్నామని కుంటి సాకులు చెప్పి తప్పించుకోవాలని ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. రూ.13 వందల కోట్లు అన్యులైన కాంట్రాక్టర్లకు అప్పగించి, డబ్బులు లేకుండా చేసి, ఆ పరిస్థితిని అధిగమించడం కోసం ప్రతిపక్షాలు అడ్డగించాయని అపవాదులు మోపడం వైసిపి నాయకులకు తగదన్నారు. ఎలక్షన్ కమిషన్ వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఆదేశాలు జారీ చేసిందన్నారు. వాలంటీర్లు రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొవాలని, మళ్లీ అధికారంలోకి వస్తే ఎక్కువ జీతాలు ఇస్తామని వారిని జగన్ మాయ చేస్తున్నారని ఆరోపించారు. వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా కట్టడి చేయాలని కలెక్టర్ ను కోరామని తెలిపారు రాజీనామా చేసిన వాలంటీర్లను మళ్లీ విధుల్లోకి తీసుకోకూడదని ఆయన డిమాండ్ చేశారు. వాలంటీర్ల ద్వారా ఎన్నికల్లో దొంగ డబ్బు పంచి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేయడానికి చూస్తున్నారని ఆరోపించారు.

జిఒ 3పై విచారణకు

పూర్తిస్థాయి జడ్జిని నియమించాలి

ప్రజాశక్తి -పాడేరు: స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగాలల్లో నూరు శాతం రిజర్వేషన్ కల్పించే జీవో 3పై ఆదివాసీ గిరిజన సంఘం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ విచారణకు పూర్తి స్థాయి న్యాయమూర్తుల సభ్యులను నియమించాలని సుప్రీంకోర్టును ఆదివాసీ అధికార మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సుప్రీంకోర్టు జీవో 3 ని రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పు ను ఆదివాసీ గిరిజన సంఘం సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ ను 2020 జూన్ 30న దాఖలు చేసినట్లు చెప్పారు. పిటిషన్ ను స్వీకరించిన కోర్టు ఐదు మందితో కూడిన జడ్జిలతో కూడిన బెంచ్‌కు సిఫార్స్ చేసిందన్నారు. గిరిజన సంఘంతో పాటు సుమారు 17 పిటిషన్ సుప్రీంకోర్టులో దాఖలు అయ్యాయని, ఇప్పటికే రెండుసార్లు విచారణకు వచ్చిందని, పూర్తిస్థాయి జడ్జిలు లేరని, దీంతో సుప్రీంకోర్టు విచారణ నిర్వహించకుండా వాయిదాలు వేస్తోందన్నారు. బుధవారం విచారణకు వస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయి జడ్జీలను నియమించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. జీవో 3 ను రద్దు చేసి నేటికీ మూడున్నర ఏళ్లు అవుతున్నా పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపట్ట లేద న్నారు. సుప్రీంకోర్టు తీర్పును పున: సమీక్షించి ఆదివాసులకు నూరు శాతం రిజర్వేషన్ హక్కుని కల్పించాలని పోరాటం చేశామని ఆయన తెలిపారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: ఆదివాసీ హక్కులు, చట్టాలు రక్షించే సిపిఎం అరకు పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సురేంద్ర, జిల్లా నాయకులు పి.బాలదేవ్, అనంతగిరి జెడ్పిటిసి డి.గంగరాజు కోరారు. అరకువేలి మండలం తురాయిగూడ, కరాయిగూడ దేవస్థానం ఆవరణంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ, ఆదివాసీల సమగ్ర అభివృద్ధి కోసం పని చేసే సిపిఎం అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. చినలబుడు పంచాయతీలో అత్యధిక మంది వ్యవసాయ రైతులు ఉన్నారని, కాయగూరలు, పప్పు దినుసుల పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేయాలని, పంటలకు మార్కెట్ సదుపాయం కల్పించి ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 9 చెక్ డ్యామ్‌లు తక్షణమే మరమ్మతు చేసి సుమారు 600 ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కె.మొద్దు, నాయకులు లోక్కోయి సహదేవ్, గాసి, రత్నకుమారి, ముకుంద్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న సురేంద్ర, బాలదేవ్, గంగరాజు

అనంతగిరి: బీజేపీకి కొమ్ము కాస్తున్న పార్టీలను ఓడించి సీపీఎం బలపర్చిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి సోమెల నాగులు కోరారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ ఫలంవలస గ్రామంలో సీపీఎం బూత్ స్థాయి సమావేశం మామిడి క్రిష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నాగులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిన బీజేపీకి మద్దతు ఇచ్చిన టిడిపి, జనసేన పరోక్షంగా మద్దతు ఇస్తున్న వైసీపీ పార్టీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. గిరిజన ప్రజల కోసం పోరాటం చేస్తున్న సీపీఎం అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సిపిఎంతోనే మన భూములకు రక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోకూరు సీపీఎం సర్పంచ్ కిల్లో మోస్య, నాయకులు కాకర సింగులు, జర్రా రాము, సన్యాసి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి గీతను ఓడించండి

పెదబయలు: మండలంలోని సీతగుంట, లక్ష్మిపేట బొండాపల్లిలో సిపిఎం సీనియర్ నాయకులు కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్పీటీసీ సభ్యులు గంగరాజు, నాయకులు బొండా సన్నిబాబు జే.సునీల్ పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతలు సురేంద్ర, గంగరాజు మాట్లాడుతూ,మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఆదివాసీ ప్రాంతంలో విస్తారమైన ఖనిజ సంపదను దోచుకుని ఎన్నికల బరిలో మళ్లీ నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.